జనగామ జిల్లా పాలకుర్తి మండలం టీఎస్‌కే తండా ప్రాథమికోన్నత పాఠశాలలో 8 మంది విద్యార్థులు ఉండగా అందరికీ కలిపి ఒకే గదిలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఐదుగురు టీచర్లు.. 8మంది విద్యార్థులు

ముగ్గురు ఎస్సైలకు ముగ్గురే కానిస్టేబుళ్లు • పాలకుర్తిలో కాంగ్రెస్ మార్క్ పాలన

పాలకుర్తి, నవంబర్ 2 : జనగామ జిల్లా పాలకుర్తి మండలంలో విచిత్ర పరిస్థితి నెలకొన్నది. పాలకుర్తి మండలం టీఎస్‌కే తండాలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు ఉండగా ఎనిమిది మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. శనివారం ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే హాజరై ఒకటి నుంచి 6వ తరగతి వరకు విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి పాఠాలు బోధించారు. ఒకటి నుంచి 6వ తరగతి వరకు 8 మంది మాత్రమే ఉన్నారు. ఉపాధ్యాయులు వంతులవారీగా విధులు నిర్వహిస్తున్నారని తండావాసులు చెబుతున్నారు. కొందరు ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముగ్గురే కానిస్టేబుళ్లు..

పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ముగ్గురు ఎస్సైలు ఉండగా, 23 మంది సిబ్బంది ఉండాలి. కానీ, ఇక్కడ ముగ్గురు కానిస్టేబుళ్లు మాత్రమే ఉన్నారు. సిబ్బంది లేక 100 నంబర్‌కు ఫోన్ చేసినా స్పందించే వారే కరువయ్యారు. పోలీస్‌స్టేషన్‌లో సరిపోను సిబ్బంది లేక ఉన్న వారు ముప్పుతిప్పలుపడుతున్నారు.

సిబ్బంది లేక వెలవెలబోతున్న జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్

రాష్ట్ర పండుగగా 'సదర్'

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నవంబర్ 2(నమస్తే తెలంగాణ): యాదవులు ఘనంగా నిర్వహించే సదర్ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. సదర్ సమ్మేళనానికి రాష్ట్ర పండుగ హోదా కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ దిశగా తగిన చర్యలు తీసుకోవాలని యువజన, సాంస్కృతిక, టూరిజం డెవలప్‌మెంట్ శాఖలను ఆదేశించింది. దీంతో ఇక నుంచి సదర్ వేడుకలను రాష్ట్ర పండుగగా జరుపనున్నారు.

'అంగన్‌వాడీ'లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్

జీవో విడుదల చేయాలి : మంత్రి సీతక్క ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్లు, ఆయాలు దాదాపు 5 వేల మంది రిటైర్మెంట్ పొందారని, వారికి వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. శనివారం సంబంధిత అధికారులతో మంత్రి సీతక్క ఫోన్‌లో మాట్లాడి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు సంబంధించిన ఫైల్స్‌పై ఆరా తీశారు. సంబంధిత జీవోను విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే సెక్రటేరియట్ నుంచి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్, పీఆర్‌అండ్ ఆర్డీ కమిషనర్ అనితారామచంద్రన్, స్పెషల్ కమిషనర్ షఫీఉల్లాతో కలిసి డీఆర్డీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీలో భాగంగా ఐదునెలల్లో చేపట్టాల్సిన పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

నర్సింగ్ కాలేజీల్లో వసతులు కల్పించండి

మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 15 మెడికల్ కాలేజీలకు అనుబంధంగా నూతనంగా ఏర్పాటు చేసిన నర్సింగ్ కాలేజీల్లో అడ్మిషన్లను వేగవంతం చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. నర్సింగ్ కాలేజీల్లో అడ్మిషన్లు, వసతులపై శనివారం ఆయన హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జనగాం, భూ పాలపల్లి, కరీంనగర్, కొడంగల్, ఆందోల్, ఆసిఫాబాద్, మెదక్, కుత్బుల్లాపూర్, ములుగు, నారాయణపేట, నిర్మల్, రామగుండం, మహేశ్వరం, నర్సంపేట, యాదాద్రిలో ఏర్పాటు చేసి న నర్సింగ్ కాలేజీల్లో వసతులపై ఆరా తీశారు. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, కమిషనర్ ఆర్వీ కర్ణన్, టీజీఎంఐడీసీ ఎండీ హేమంత్ సహదేవ్‌రావు పాల్గొన్నారు.

అన్ని గురుకులాల్లో కోడింగ్ హబ్

ఎస్సీ గురుకులాల సెక్రటరీ వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని 268 గురుకుల పాఠశాలల్లో కోడింగ్ విధానం అమలు చేస్తున్నారని, దీంతో అన్ని గురుకులాల్లో కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలంగాణ ఎస్సీ గురుకుల సెక్రటరీ తెలిపారు. శనివారం ప్రకటన విడుదల చేశారు. కోడింగ్ పేరుతో కొంతమంది నిధులు దుర్వినియోగం చేసి, ఇప్పుడు వారే.. ఆ గురుకుల పాఠశాల మూతపడుతుందని దుష్ప్రచారం చేస్తున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు సెక్రటరీ పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలు మూతపడడం లేదని, మొత్తం 268 పాఠశాలల్లో విద్యార్థుందరికీ ఉచితంగా విద్య అందిస్తున్నట్టు ఆయన తెలిపారు.

జీపీ సెక్రటరీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా బలరాం

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : పంచాయతీ సెక్రటరీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సందిళ్ల బలరాం, కార్యదర్శిగా పీ వెంకటరమణ ఎన్నికయ్యారు. శనివారం నాంపల్లి టీఎన్జీవో భవన్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో 36 మందితో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్, ఎస్ఎం ముజీబ్ హుస్సేని, అసోసియేట్ అధ్యక్షుడు ము త్యాల సత్యనారాయణగౌడ్ సమావేశంలో పాల్గొని సెక్రటరీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

..నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

మొదటిపేజీ తరువాయి...

పంట మొత్తం ఇటు కల్లాల్లో, అటు కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతున్నది. ధాన్యాన్ని కొనుగోలు చేసే దిక్కులేక రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

ధాన్యం దించుకోం..

రాష్ట్రంలో కొద్ది రోజులుగా సర్కారు వర్సెస్ రైస్ మిల్లర్ల కథ నడుస్తున్నది. అక్టోబర్ 29న ప్రభుత్వం విడుదల చేసిన కొనుగోళ్ల పాలసీతో ఇది మరింత ముదిరింది. కొత్త పాలసీని మిల్లర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ముఖ్యంగా రెండు అంశాలపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం దించుకున్న మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీ తీసుకోవాలనే నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో పాటు సన్నధాన్యంలో అవుట్ టర్న్ రేషియో తేల్చకుండా దించుకోవాలని ఒత్తిడి చేయడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ రెండు సమస్యలు పరిష్కరికుండా ధాన్యం దించుకునేది లేదని తెగేసి చెబుతున్నారు. ఇందుకు సంబంధించి అన్ని జిల్లాల్లో మిల్లర్లు ఆయా కలెక్టర్లకు వినతిపత్రాలు కూడా అందించారు. అయితే జనగాం, నిజామాబాద్‌లో మాత్రం అక్కడి మిల్లర్లను బెదిరించి ధాన్యం దించుకునేందుకు ఒప్పించినట్టుగా తెలిసింది. మిగిలిన జిల్లాల మిల్లర్లు మాత్రం సమస్యలు పరిష్కరించే వరకు ధాన్యం దించుకోమని చెబుతున్నారు.

మొండిగా సర్కారు

మిల్లర్లతో పంచాయితీతో కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఇవేవి పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి రైతుల ఇబ్బందులను తొలగించేందుకు కనీస ప్రయత్నాలు కూడా చేయడంలేదనే విమర్శలు ఉన్నాయి. ఇందులో భాగంగానే మిల్లర్ల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాము చేసేదే చేస్తాం.. మిల్లర్లు వస్తే రానీ లేకపోతె లేదు అనే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని తెలిసింది. నిబంధనలను సడలించేది లేదని అధికారులు స్పష్టం చేసినట్టుగా తెలిసింది. దీంతో ప్రభుత్వ మొండి వైఖరి కారణంగా మిల్లర్లతో పంచాయితీ ఇప్పట్లో తెగే అవకాశం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిలిచిపోయిన కొనుగోళ్లు

రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించి నెల రోజులవుతున్నది. అయినప్పటికీ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడం గమనార్హం. మిల్లర్లు, సర్కారు పంచాయితీతో రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు రాశులు గుట్టలను తలపిస్తున్నాయి. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని దించుకోవాల్సిన మిల్లర్లతో ఒప్పందాలు కాకపోవడంతో క్షేత్రస్థాయి అధికారులు చేతులెత్తేస్తున్నారు. పేరుకే 7572 కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్టు ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటి వరకు 4598 కేంద్రాలను మాత్రమే ప్రారంభించింది. ఇందులో సగం కేంద్రాల్లో కూడా కొనుగోళ్లు ప్రారంభంకానట్టుగా తెలిసింది. పలు జిల్లాల్లో కురిసిన వర్షాలతో కల్లాలు, కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయి, నీళ్లలో కొట్టుకుపోవడంతో రైతులు నష్టపోతున్నారు. రైతుల గోసను చూసి కూడా ప్రభుత్వం చలించడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 2: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో నేతాజీ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

భూదాన్ పోచంపల్లిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

20 రోజులైనా ధాన్యం కొంటలేరు

కొల్చారం, నవంబర్ 2: కాంగ్రెస్ సర్కారు 20 రోజులైనా ధాన్యం కొంటలేదు.. టార్పాలిన్ల కిరాయే వేలల్లో అవుతుందని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డితో రైతులు గోడు వెళ్లబోసుకున్నారు. శనివారం మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో ఆమె ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు వడ్లు వెంటనే కొనేవారు.. మూడు రోజుల్లోనే ఖాతాల్లో డబ్బులు పడేవని గుర్తుచేశారు. అనంతరం మొలకలు వచ్చిన ధాన్యాన్ని ఎమ్మెల్యేకు చూపించారు. ఆమె వెంట మాజీ జడ్పీటీసీలు ముత్యంగారి మేఘమాల సంతోష్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, నాయకులు తదితరులు ఉన్నారు.

వరిగుంతంలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

9 మంది లెక్చరర్ల ఉద్యోగాలు ఊస్ట్

- ఫేక్ సర్టిఫికెట్లతో లెక్చరర్ ఉద్యోగాలు
- మరో వంద మంది సర్టిఫికెట్లపై అనుమానాలు
- కేయూ సర్టిఫికెట్లే అధికం.. స్పందించని వర్సిటీ

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఇంటర్ విద్యలో ఫేక్ సర్టిఫికెట్లు కలకలం సృష్టిస్తున్నాయి. పలువురు అధ్యాపకులు ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందగా, ఇప్పుడవి ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఇప్పటి వరకు 9 మంది దొరకగా, వారిని ఉద్యోగాల నుంచి డిస్మిస్ చేశారు. వీరేకాకుండా మరో వంద మంది ఫేక్‌రాయుళ్లు ఉన్నట్టుగా తేలింది. ఇది వరకు డిగ్రీ, పీజీ నకిలీ సర్టిఫికెట్లు దొరకగా, ఓ మహిళా లెక్చరర్ పదో తరగతి నకిలీ మెమోను సమర్పించి అడ్డంగా బుక్కయ్యారు. ఇంటర్ విద్యలో 2,904 జేఎల్, 184 మంది వొకేషనల్ లెక్చరర్లను ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. వీరంతా 2000 సంవత్సరం తర్వాత నియమితులైన వారే. 20 ఏండ్ల తర్వాత వీరంతా రెగ్యులరైజ్ అయ్యారు. అప్పట్లో సర్టిఫికెట్ల పరిశీలన జరపగా... కొన్ని ఫేక్ సర్టిఫికెట్లు బయటపడడంతో పక్కనపెట్టారు. అయినా కొన్నింటిని గుర్తించలేకపోయారు. తాజాగా రెగ్యులరైజ్ అయిన ఏడాదిన్నర తర్వాత వంద మంది లెక్చరర్ల సర్టిఫికెట్లపై ఫిర్యాదులొచ్చాయి. వీటిలో కాకతీయ వర్సిటీ పేరుతో జారీ అయిన సర్టిఫికెట్లే ఎక్కువగా ఉన్నాయి. మరికొన్ని ఓయూకి చెందినవి ఉన్నాయి. సంబంధిత సర్టిఫికెట్లు అసలువో.. నకిలీవో తేల్చేందుకు యూనివర్సిటీలకు పంపించారు. అయితే ఈ సర్టిఫికెట్లపై కాకతీయతోపాటు ఉస్మానియా యూనివర్సిటీ సైతం తీవ్ర జాప్యం చేస్తున్నది. వర్సిటీలు వేగంగా స్పందించడంలేదని ఇంటర్ విద్య కమిషనరేట్ అధికారులంటున్నారు. నకిలీవని తేలితే సంబంధిత లెక్చరర్లపై కఠిన చర్యలుంటాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.

పైరవీలు.. పరిచయాలను పక్కన పెట్టండి

- తప్పు జరిగితే ఆశ్చర్యకర నిర్ణయాలు తీసుకుంటాం
- నూతన వీసీలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): వైస్‌చాన్స్‌లర్లు పైరవీలు, పరిచయాలను పక్కనపెట్టి పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. కొత్త వీసీలంతా వర్సిటీల ప్రక్షాళనకు చర్యలు చేపట్టాలని, వాటికి పునర్వైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉన్నత విద్యామండలి చైర్మన్, వైస్‌చైర్మన్, పలు వర్సిటీల వీసీలు శనివారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ప్రఖ్యాత ఉస్మానియా వర్సిటీకి మంచి పేరుండే.. ఈ వర్సిటీ పరిస్థితేం బాగాలేదు. ఉస్మానియా, జేఎన్టీయూల్లో చదివితే గర్వంగా చెప్పుకునే రోజులుండే.. తిరిగి వర్సిటీ గౌరవం పెంచే దిశగా పనిచేయాలని సీఎం సూచించారు. మంచి పనులు చేసేందుకు వీసీలకు సహకరిస్తామని, తప్పు జరిగితే ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయిలను అరికట్టాలని, విద్యార్థులను గమనించి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. ఆర్జీయూకేటీలో అనేక సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, వీసీలు పాల్గొన్నారు.

రాష్ట్రంలోకి అక్రమంగా కర్ణాటక ధాన్యం

చెక్‌పోస్టు వద్ద తిప్పి పంపిన పోలీసులు

మాగనూరు, నవంబర్ 2 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు పక్క రాష్ట్రాల నుంచి ధాన్యాన్ని తీసుకొచ్చేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. అక్రమార్కులను అడ్డుకునేందుకు నారాయణపేట జిల్లా కృష్ణ మండలం మారుతీనగర్ వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. శనివారం చెక్‌పోస్టు వద్ద కర్ణాటక నుంచి లారీలో ధాన్యాన్ని రాష్ట్రంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. అనుమానం వచ్చిన పోలీసులు లారీ డ్రైవర్‌ను వివరాలు అడగగా.. కొత్త నాటకానికి తెరలేపాడు. మక్తల్ మండలంలోని రైస్ మిల్లు నుంచి ధాన్యాన్ని కర్ణాటకకు తరలించానని.. అక్కడ వడ్లను తిరస్కరిస్తే రైస్‌మిల్లులో దింపేందుకు తిరిగి తీసుకెళ్తున్నానని చెప్పాడు. దీంతో పోలీసులు లారీని వెనక్కి పంపించారు.

కొనుగోళ్లను వేగవంతం చేయాలి : మంత్రి

హైదరాబాద్, నవంబర్ 2(నమస్తే తెలంగాణ) : మొత్తం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి, కొనుగోళ్లను వేగవంతం చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు శనివారం ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 4,598 కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని, ప్రభుత్వం నిర్ణయించిన 7,572 కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు.

'సీతారామ'కు భూసేకరణ పూర్తిచేయాలి

సీతారామ ప్రాజెక్ట్ ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేయాలని, భూసేకరణ కోసం ప్రత్యేక సర్వే బృందాలను నియమించాలని సంబంధిత అధికారులను సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సీతారామ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి శనివారం జలసౌధలో సాగునీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షించారు. ఎత్తిపోతల పథకం పనుల కోసం ఇప్పటి వరకు 6,234.91ఎకరాలు సేకరించగా, ఇంకా 993 ఎకరాలు సేకరించాల్సి ఉందని తెలిపారు. సమావేశంలో నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళిత తహసీల్దార్‌పై కాంగ్రెస్ నేత దాడి

మొదటిపేజీ తరువాయి...

బాటిల్ విసిరి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాలలో చోటుచేసుకుంది. మండలంలోని మునుగాలలో మల్టిపుల్ వర్కర్‌ను మార్చాలంటూ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి కొన్ని రోజులుగా గ్రామానికి ప్రత్యేకాధికారిగా ఉన్న తహసీల్దార్ నరేందర్‌పై ఒత్తిడి తెస్తున్నాడు. ఇందుకు తహసీల్దార్ మల్టిపుల్ వర్కర్‌ను తొలగించాలనే విషయమై ఎంపీడీవో, ఎంపీవోలను సంప్రదించి శనివారం గ్రామ సభ ఏర్పాటు చేయాలని చాటింపు వేయించారు. 'గ్రామసభ పెట్టకుండానే మల్టిపుల్ వర్కర్‌ను తొలగించాలి. గ్రామ సభ పెట్టి గొడవలు సృష్టించాలనుకుంటున్నారా? మేం చెప్తే తీసేయాల్సిందే' అంటూ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం విధుల్లో ఉన్న తహసీల్దార్‌ను దుర్భాషలాడుతూ ఆయనపైకి వాటర్ బాటిల్ విసిరికొట్టాడు. అక్కడే ఉన్న సిబ్బంది వెంటనే స్పందించి గొడవ కాకుండా నిలువరించారు. ఈ విషయమై తహసీల్దార్ ఇటిక్యాల ఎస్సై వెంకటేశ్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఫిర్యాదు చేస్తే.. శనివారం సాయంత్రమైనా ఎస్సై ఎలాంటి కేసు నమోదు చేయలేదు. తహసీల్దార్‌పై జరిగిన దాడి ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో తహసీల్దార్ మనోవేదనకు గురయ్యారు. ఒక అధికారిపై నాయకుడు ఇష్టానుసారంగా దుర్భాషలాడి దాడి చేస్తే పోలీసులకు చెప్పినా పట్టించుకోకపోతే ప్రజలకు ఎలా న్యాయం చేస్తారని ఆవేదన వ్యక్తంచేశారు. అలంపూర్ నియోజవర్గంలోని రెవెన్యూ సిబ్బంది, అధికారులతో కలిసి తహసీల్దార్ నరేందర్.. తనపై కాంగ్రెస్ నేత చేసిన దాడి విషయాన్ని జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన కలెక్టర్.. అధికారులపై దాడులకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని కలెక్టర్ ఎస్పీని ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఇటిక్యాల ఎస్సైని వివరణ కోరగా.. విధులను అడ్డుకోవడం, దుర్భాషలాడటం, అధికారిపై దాడి చేసినందుకుగానూ ప్రభాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ఇబ్రహీం, శేషన్న, సాకలి మద్దిలేటి, బోయ వెంకటన్నపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని తెలిపారు.

జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్‌తో సమావేశమైన తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

పత్తి కొనుగోలు కేంద్రాలన్నీ ప్రారంభించాలి

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

హైదరాబాద్, నవంబర్ 2(నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పత్తి కొనుగోలు కేంద్రాలను సోమవారం లోగా ప్రారంభించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మార్కెటింగ్ శాఖ అధికారులను హెచ్చరించారు. శనివారం సచివాలయంలో పత్తి కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నోటిఫికేషన్ ఇచ్చిన 279 జిన్నింగ్ మిల్లులు నవంబర్ 4 వరకు ప్రారంభించాలని, ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు కొత్తగా నియమితులైన వ్యవసాయ అధికారులకు ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో నిర్వహించిన ఓరియంటేషన్‌లో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్రాన్ని వ్యవసాయరంగంలో అగ్రగామిగా నిలబెట్టే ప్రభుత్వ సంకల్పంలో అధికారులంతా భాగస్వాములు కావాలని కోరారు.

కూరగాయల కొరత తీర్చే ప్రణాళికలు

ఉద్యాన వర్సిటీ వీసీ రాజిరెడ్డి

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కూరగాయల కొరతను అధిగమించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్టు ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ దండా రాజిరెడ్డి తెలిపారు. ఇందు కోసం దేశవ్యాప్తంగా ఉన్న స్పెషలైజ్డ్ యూనివర్సిటీలతో కలిసి పని చేయనున్నట్టు పేర్కొన్నారు. శనివారం యూనివర్సిటీలో విద్యార్థులు, శాస్త్రవేత్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఉద్యాన విద్యల్లో మార్పులు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కేవలం 12.8 లక్షల ఎకరాల ఉద్యాన పంటల విస్తీర్ణంతో 25 శాతం జీఎస్టీపీ కంట్రిబ్యూట్ చేస్తున్నదని, ఇది పెరిగే అవకాశం ఉందని చెప్పారు.

కేరళకు సీఎం, మంత్రులు

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ రెడ్డి తోపాటు పలువురు మంత్రులు శనివారం కేరళకు వెళ్లారు. కొచ్చిన్‌లో ఓ వివాహ వేడుకలో పాల్గొనేందుకు సీఎంతోపాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ ప్రత్యేక విమానంలో వెళ్లారు. తిరిగి రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు.

నిమ్స్‌లో అరుదైన గుండె శస్త్రచికిత్స

- యువకుడికి 35మి మీ కృత్రిమ కవాటం అమర్చిన వైద్యులు
- దేశంలోనే తొలిసారి అని తెలిపిన వైద్యులు

ఖైరతాబాద్, నవంబర్ 2: అరుదైన గుండె వ్యాధితో బాధపడుతున్న ఓ యువకుడికి నిమ్స్ వైద్యులు ప్రాణదానం చేశారు. శనివారం నిమ్స్ దవాఖానలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సాయి సతీశ్ వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన బానోతు అశోక్(20)కు పుట్టుకతోనే గుండె సమస్య వచ్చింది. అప్పుడు ఓ ప్రైవేట్ దవాఖానలో ఓపెన్ హార్ట్ సర్జరీ చేసి ఉపశమనం కలిగించారు. పదేండ్ల తర్వాత సమస్య మళ్లీ వచ్చింది. వివిధ దవాఖానల్లో చూపించినా సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకలేదు. ఓ కార్పొరేట్ దవాఖానలో చికిత్సకు కనీసం రూ.35లక్షల ఖర్చు వస్తుందని చెప్పడంతో చివరాశగా నిమ్స్‌లో చేర్పించారు. అశోక్ గుండె కవాటం (పల్మనరీ వాల్వ్)దెబ్బతినడం వల్ల పంపింగ్ అయిన రక్తం వెంటనే వెనక్కి వస్తుంది. ఏ మాత్రం శ్రమ చేసినా హార్ట్ రేట్ పెరిగిపోవడంతో పాటు శరీరం మొత్తం నీలి రంగులోకి మారిపోతుంది. దేశంలో 29 నుంచి 32 మిల్లీ మీటర్ల వాల్వ్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. నిమ్స్ వైద్యులు కృత్రిమ గుండె కవాటాలను రూపొందించే సంస్థను సంప్రదించి 35 మిల్లీమీటర్ల వాల్వ్‌ను మూడు నెలల్లో తయారు చేయించారు. దీనికి మై వాల్వ్ అని నామకరణం చేశారు. ఈ సైజు వాల్వ్‌ను తయారు చేయడం దేశంలోనే తొలిసారి అని వైద్యులు తెలిపారు. 35 మిల్లీమీటర్ల ఉన్న కృత్రిమ పల్మనరీ వాల్వ్‌ను డాక్టర్ సాయి సతీశ్ నేతృత్వంలో డాక్టర్ హేమంత్, డాక్టర్ శైలేష్ భాటియా, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ అమర్నాథ్, డాక్టర్ త్యాగి, డాక్టర్ అద్నాన్‌లు ఓ బెలూన్ మీద అమర్చి ట్రాన్స్‌కేథటర్‌ను ఫ్యుమరల్ వేయిన్స్ ద్